# హృదయం

మరువాడ నారాయణమూర్తి





**సాయంత్రం ఆఫీస్ నుంచి ఇంటి కొచ్చి ముఖం కడుక్కొని టీ చేస్తోంది ఇరవై నాలుగేళ్ళ అవివాహిత అపర్ణ.**

తలుపెవరో తట్టారు. ఆమె తలుపు తెరిచి ఎదురుగా నిలబడ్డ మనిషిని చూసి నిలువునా నిర్ఘాంత పోయింది. అతడు తనని గుర్తించలేదని అర్థమై చాలా మురిసిపోయిందామె.

ఆమె తన భయాన్ని వ్యక్తం చెయ్యకుండా "కూర్చోండి. ఇపుడే వస్తా"నంటూ అతనికి కుర్చీ చూపించి లోనికెళ్లి రెండు కప్పులు టీ తీసుకొచ్చి ఒకటి అతని చేతి కందించింది. మొహమాటపడుతూ అతడు దాన్ని తీసుకున్నాడు.

"మీరు కొత్తగా ఈ వాటాలో దిగినట్లున్నారు. మీకు ముందున్నవారు నా దగ్గర సబ్బులూ, పౌడర్లూ, తల నూనె మొదలైనవి తీసుకొనేవారు. వారే వున్నారనుకొని తలుపు తట్టి మీకు శ్రమ కలిగించాను. క్షమించండి" అంటూ టీ తాగి కప్పు క్రింద పెడుతూ, "మీకేమైనా కావాలా?" అని ప్రశ్నించాడు.

అపర్ణ నాలుగు సబ్బులూ, టాల్కం పౌడరూ, తలనూనె, పర్సూ తీసుకుని ఎంత ఇవ్వాలో చెప్పమని అడిగింది. అతడు చెప్పాడు. తెచ్చి ఇచ్చింది.

"మీకు రెండ్రూపాయలివ్వాలి. నా దగ్గర చిల్లర లేదండీ."

"లేకపోతే పోనియ్యండి. రెండు రూపాయిలు మీ దగ్గర వుంటే నా కొచ్చిన నష్టమేమీ లేదు."

మళ్లీ వస్తానని చెప్తూ అతడామె దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. గుమ్మం దగ్గరే నిలబడి పోయిన అపర్ణ కళ్ళ ముందు గతం కదిలింది....

* * *

అపర్ణ బి.ఎ. రెండో సంవత్సరం చదువుతూంది. ఆ రోజు రిజల్ట్సు వచ్చి ఫస్ట్‌క్లాస్‌లో పాసవడంతో ఒంట్లో హుషారు లేకున్నా తన స్నేహితురాళ్ళతో మొదటి ఆట సినిమా కెళ్లింది. తల నొప్పి ఉధృతంగా వుండ డంతో ఇంక వుండలేక ఇంటర్వెల్‌లో ఒంటరిగా ఇంటికి బయలుదేరింది.

సమయం 8-45. విద్యుద్దీపాలు మసక మసకగా వెలుగుతున్నాయి. కటిక చీకటి. రోడ్డు నిర్మానుష్యంగా వుంది అడపా దడపా ఓ కారో, లారీయో పోవడం తప్ప. రోడ్డు పక్కన విశాలమైన మామిడితోపు.

అకస్మాత్తుగా ఆమె చేతినో యువకుడు దృఢంగా బంధించి తోటలోకి లాక్కెళ్ళాడు. ఏడ్పులూ, పెడ బొబ్బలూ అమెను రక్షించడానికి ఏ వ్యక్తినీ తీసుకు రాలేకపోయాయి. ఎంతగా ప్రతిఘటించినా అతని పశు బలం ముందు తానోడిపోయింది. అనాఘ్రాత కుసుమం మలినమైంది.

ఆ యువకుడామెను మానభంగం చేశాడు. శీలాన్ని కోల్పోయిన ఆమె యేడ్పూ, కేకలూ తోట కాపలాదారు విని పరుగెత్తుకు వచ్చి ఆ యువకుడ్ని పట్టుకుని పోలీస్

స్టేషన్‌కి తీసికెళ్లి సర్కిల్ ఇన్స్పెక్టరుకి అప్పజెప్పాడు. ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు తయారు చేసి/మానభంగానికి గురైన అపర్ణ వాంగ్మూలంతో, డాక్టర్ ఇచ్చిన సర్టిఫికెట్‌తో, తోటమాలి·సాక్ష్యంతో కోర్టులో కేసు దాఖలు చేశారు.

మానభంగం నేరం కింద మేజిస్ట్రేట్ ఆ యువకునికి మూడు సంవత్సరాల కఠిన శిక్ష విధించాడు.

అప్పుడప్పుడే మరచేందుకు ప్రయత్నిస్తున్న గతమంతా గుర్తుకువచ్చి అపర్ణ జబ్బుపడినదానిలా తయారైంది. ఆ రాత్రి భోజనం, నిద్రా రెండూ కరవయ్యాయామెకి.

* * *

అతని పేరు సుధాకర్. బి.కాం. విద్యార్థి. అతని వయసిపుడు ఇరవై ఆరు సంవత్సరాలు.

కారాగృహం నుంచి వచ్చిన సుధాకర్‌ని అయినవాళ్లందరూ వెలివేశారు. ప్రభుత్వం తనకే ఉద్యోగాన్నీ ఇవ్వదు. బ్రతకడం కోసం ఇంటింటికి వెళ్లి సబ్బులు, తల నూనెలు అమ్మడం సాగించాడు. అతని వ్యాపారం దినదినాభివృద్ధి చెందింది. రోజువారీ సంపాదన 15-20 రూపాయిల మధ్యగా వుంటుంది. జీవితం సాఫీగానే సాగిపోతూంది.

జరిగిపోయిన విషాద సంఘటన జ్ఞప్తికి వచ్చినప్పుడు సుధాకర్ కుమిలి కుమిలి ఏడుస్తాడు. తనని ఆదరించి, ఆపేక్షతో, అనురాగంతో చూసే వ్యక్తులు లేక, ఒంటరితనాన్ని భరించలేక ఎంతగానో బాధపడతాడు.

* * *

అపర్ణని తల్లిదండ్రులు వెలి వేశారు ఆమె చెయ్యని నేరానికి. 'మనదగ్గరుంటే మన పరువు ప్రతిష్టలేం కావాలి? దానికెలాగూ కాదు. మిగిలిన ఆడపిల్లలకి పెళ్లి జరగడం ఎంత కష్టం!' అదీ వాళ్ల వాదం.

అపర్ణ ధైర్యంతో పరిస్థితులను ఎదుర్కొని, స్నేహితురాళ్ల సహాయంతో ప్రభుత్వం అందించిన విద్యార్థి వేతనంతో బి.ఎ. పూర్తిచేసి టైపు, షార్ట్ హేండూ పరీక్షలు పాసై స్టెనోగ్రాఫర్‌గా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకుంది. జీతం నెలకి వెయ్యికి పైగానే దొరుకుతుంది.

వివాహం చేసుకుని భర్తా, పిల్లలతో సుఖంగా జీవిస్తూ తనని వేధించే ఒంటరితనాన్ని దూరంగా నెట్టివేయాలన్న ఆశతో అపర్ణ ధైర్యంతో రోజులు వెళ్లబుచ్చుతోంది. కాని మానభంగానికి గురైన స్త్రీని వివాహం చేసుకోగల ఆదర్శప్రాయుడైన ఏ వ్యక్తీ ఇంతవరకామె ఎదుట పడలేదు.

* * *

ఆ రోజు ఆదివారం.

ఉదయమే తల స్నానం చేసిన అపర్ణ జుట్టు ఆరబెట్టుకుంటూంది వరండా మీద నిలబడి.

"సుప్రభాతం మేడమ్!" అంటూ విష్ చేసిన సుధాకర్‌కేసి ఆశ్చర్యంగా చూస్తూ, "గుడ్ మార్నింగ్" అంది చిరునవ్వులు చిందిస్తూ.

సుధాకర్ లోనికెళ్లి బుజానికి వ్రేలాడుతున్న బరువైన సంచిని క్రింద పెట్టి కుర్చీలో కూర్చున్నాడు.

ఆమె అతని కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నది. ఇద్దరూ టీ త్రాగారు.

"బి.కాం. చదివిన మీరు ఏదైనా మంచి ఉద్యోగం చూసుకోలేకపోయారా?"

సుధాకర్ ఆశ్చర్యపోయాడు అతని చదువు గురించి ఆమె కెలా తెలిసింది అని.

"చదువైతే వున్నది కాని ఉద్యోగార్హత కోల్పోయానండీ!"

"సుధాకర్! మీకెందరు పిల్లలు?"

"నేను బ్రహ్మచారినే. అది నా దురదృష్టం.

"ఒక దుర్ముహూర్తాన పైశాచిక వాంఛకి బానిసనై ఒక అమాయక యువతి శీలాన్ని మంట గలిపిన పరమకిరాతకుణ్ణి. చదివిన చదువు, సంపాదించిన జ్ఞానమూ మంటకలిసాయి. 'నా' అన్న వాళ్ళందరూ నన్ను వెలివేశారు. అయినా మీకు నా చదువూ, నా పేరూ మొదలైన విషయాలన్నీ తెలిసినై?" ఏడ్చాడు కన్నీరు కాల్వలై ప్రవహించేటట్లు, ముఖాన్ని తన చేతి రుమాలులో దాచుకొన్నాడు.

"ఔను. మీరూ నేనూ ఒకే పథంలో కొట్టుమిట్టాడుతున్నాం. అంతే!!"

"మీరు చెప్పేది నాకు అర్థం కావడంలేదు."

"మీదురాగతానికి సమిధను. నేను చేసిన అత్యానికి మూడు సంవత్సరాల కఠినశిక్ష అనుభవించారు మీరు. ఇప్పటికీ కుమిలి పోతున్నాను నేను. అదంతా విధి లిఖితం. ఇప్పుడు మన మిద్దరం ఇలా కలుసుకోడం యాదృచ్ఛికం" అంటూ అపర్ణ కళ్ళు సజలాలయ్యాయి.

సుధాకర్ నిర్విణ్ణుడయాడు ఆమె మాటలు విని. ఈమెనేనా తాను ఆనాడు మానభంగం చేసినది! ఆశ్చర్యాన్నించి తేరుకున్నాక పశ్చాత్తాపంతో, లజ్జా భారంతో అతను తల ఎత్తలేకపోయాడు.

"అపర్ణా! నన్ను క్షమించు" అంటూ ఆమె పాదాలపై ఒరిగాడు. ఆమె అతన్ని లేవనెత్తి కుర్చీ మీద కూర్చో బెట్టింది. అతని యెడతెగని కన్నీటిధారలు ఆమె చేతుల్ని తడిపి వేసినై.

* * *

"మన జీవితాలు ఒక కొలిక్కి రావాలంటే మన మిద్దరం ఏకం కావాలి. అది తప్ప మనకి గత్యంతరం లేదు" అంది అపర్ణ తన దుఃఖాన్ని తనలోనే దాచుకొంటూ.

సుధాకర్ దిగ్భ్రాంతి చెందాడు. అతని ఆనందానికి అవధీ పరిధి లేకుండా పోయాయి.

"నీ యిష్టమే నాయిష్టం అపర్ణా!" అంటూ ఆమె రెండు చేతుల్నీ తన చేతులలో బంధించాడు.

* * *

ఒక శుభదినాన అపర్ణా సుధాకరులు తమ తమ మిత్ర బృందం వెంట రాగా, రిజిస్ట్రార్ ఆఫీసులో వివాహం చేసుకొని భార్యాభర్తలయారు.

అది వారి జీవితంలో నవోదయం!

## ఇలా జరుగుతుందా?

ఈ కథకు రచయిత చెప్పిన ముగింపు సమంజసమని మీరు భావిస్తున్నారా? అపర్ణ చిక్కిన పరిస్థితిలో ఏ అమ్మాయి వున్నా ఈ గాథ ఇలాగే ముగుస్తుందా? మీ అభిప్రాయాన్ని ఇన్‌లాండ్ లెటర్‌లో 'నవోదయం' కథ ముగింపు.

ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
పో.బా.నెం.712,
లబ్బీపేట, విజయవాడ-520 010

అన్న చిరునామాకు వ్రాసి పంపండి.

—ఎడిటర్



ఇటీవల శ్రీశైలంలో జరిగిన డామ్ ఉద్యోగుల సాంస్కృతిక కార్యక్రమంలో హిప్నాటిజం వైజ్ఞానిక ప్రదర్శన చేస్తున్న 'ఇంద్రజాల ప్రవీణ' శ్రీ ఎమ్మెస్ రెడ్డి